క్లుప్తంగా

టీబీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాహెన్‌రాజ్

ఆదోని టౌన్: టీబీ (క్షయ) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ షేకున్‌బాను, హర్షిత సూచించారు. మంగళవారం పట్టణంలోని ఇందిరానగర్, శంకర్‌నగర్, హనుమాన్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో టీబీపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొండి టీబీ కేసులను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వారు మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్న వారు తప్పనిసరిగా గల్ల పరీక్ష, రక్త పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలను ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులను ఆరు నెలలపాటు అందజేస్తూ, ఖర్చులకు ప్రతినెలా రూ.500 చొప్పున ఆరు నెలలపాటు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, జ్ఞానేశ్వరిదేవి, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని ప్రతిభ హైస్కూల్‌లో మంగళవారం మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్‌లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సచివాలయం తనిఖీ



సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 19వ వార్డు సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ కృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. వివిధ సమస్యలను పరిష్కారం చేయాలని, సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలనని సూచించారు.

ఘనంగా మహబూబ్ సుభాని ఉరుసు



అలంకరించిన మహబూబ్‌సుభాని దర్గా

కౌతాళం: మండల కేంద్రంలో మహబూబ్ సుభాని ఉరుసు ఉత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. కొందరు భక్తులు జెండాలను ఇళ్ల నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు చేశారు. దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం విద్యార్థులు, యువకులు ఆలపించిన సలాంలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మహబూబ్‌సుభాని మార్గంలో నడవాలని ముస్లిం పెద్దలు సూచించారు. రోజుకు ఐదు పూటల నమాజు ఆచరించి శాంతితో మెలగాలన్నారు.

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో మంగళవారం గ్యారతారీఖ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలను సమర్పించారు. దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడి నెలకున్నాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు.

14 బాక్సుల మద్యం పట్టివేత

ఆదోని అర్బన్: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి, 14 బాక్సుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పక్కా సమాచారంతో పట్టణ శివారులోని సిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా ఆదోని పట్టణంలోని మరాఠీవాడీకి చెందిన బందే అలీ కర్ణాటక టెట్రా ప్యాకెట్ల 14 బాక్సులను ఆటో(ఏపీ21టీడబ్ల్యూ 0859)లో తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. ఆటోను సీజ్ చేసి, పంచనామా ద్వారా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది సత్తార్‌వలి, మునిచంద్ర, మల్లయ్య, వీరశేఖర్, లక్ష్మన్న, సుధాకర్ ఉన్నారు.

పని బంగారం.. బతుకు భారం

- జ్యూవెలరీ మాల్స్ రాకతో బంగారు దుకాణాలకు తగ్గిన గిరాకీ
- రెడీమేడ్ ఆభరణాలపై మక్కువ చూపుతున్న వినియోగదారులు
- ఉపాధి కోల్పోతున్న స్వర్ణకారులు



ఆభరణం తయారు చేస్తున్న స్వర్ణకారుడు రియాజ్

ఎమ్మిగనూరు టౌన్: చేసే పని బంగారమే అయినా వారి బతుకులు మాత్రం భారంగా గడుస్తున్నాయి. మగువలు మెచ్చిన రీతిలో రెడీమేడ్ ఆభరణాలు లభ్యమవుతుండటం, అధునాతన యంత్రాలు రాక, కార్పొరేట్ సంస్థలు వ్యాపారంలోకి రావడంతో స్వర్ణకారులకు క్రమేణా పనులు తగ్గిపోతున్నాయి. రెడీమేడ్ రంగంలో కొత్త కొత్త డిజైన్లతో మగువలను ఆకర్షించే విధంగా నగలు రావడంతో స్వర్ణకారుల వద్ద నగలు చేయించుకొనే వారి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. ఒకప్పుడు చేతినిండా పనివుండే స్వర్ణకారులు నేడు పనుల్లేకుండా బంగారు దుకాణాల ముందు ఖాళీగా కూర్చునే పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన చెందుతున్నారు.

600 పైగా స్వర్ణకారులు..

ఎమ్మిగనూరు పట్టణ పరిధిలో దాదాపు 70కి పైగా బంగారు దుకాణాలుండగా వాటిలో పనిచేసే స్వర్ణకారులు 600 మంది వరకు ఉన్నారు. అన్నీ సామాజిక వర్గాలవారు ఈ స్వర్ణకార వృత్తిలో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో కార్పొరేట్ నగల సంస్థలు పోటాపోటీగా డిస్కౌంట్ల పేరుతో రకరకాల డిజైన్లతో మగువలను ఆకర్షిస్తుండటంతో నగలను తయారు చేయించుకునే వారి సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది. ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాల ప్రజలు ఆదోనితో పాటు కర్నూలు నగరానికి వెళ్లి మాల్స్ ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలోని స్వర్ణకారులకు పెళ్లిల సీజన్‌లో కొంతమేర పని ఉన్నా.. ఆ తరువాత అడపాదడపా నగల తయారీ పనులు ఉంటున్నాయి. దీంతో బంగారుతో పాటు వెండి నగ తయారు చేసే కార్మికులు పనుల్లులేక పూట గడవని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన చెందుతున్నారు. రోజంతా బంగారం దుకాణాల వద్ద పనుల కోసం ఎదురు చూసే పరిస్థితి వుంటుందని వారు వాపోతున్నారు.

ఇతర పనుల వైపు స్వర్ణకారులు

చేతివృత్తిని నమ్ముకొని కుటుంబాలను పోషించుకొనేందుకు పనులు అంతంత మాత్రమే వుంటుండటంతో వృత్తిని వదులుకొనే దుస్థితి నెలకొందని కొందరు స్వర్ణకారులు పేర్కొంటున్నారు. నగల తయారీ పనులున్నప్పుడు ఆయా పనులు చేస్తూ మిగిలిన సమయాల్లో ఉపాధి కోసం వేరే పనులు సైతం చేసుకుంటున్నామని చెబుతున్నారు.

వేధిస్తున్న అనారోగ్య సమస్యలు

నిప్పు సెగతో పనులు వుండటంతో అనారోగ్యం బారిన పడటమే కాకుండా కంటి చూపు దెబ్బతినే అవకాశాలు కూడా లేకపోలేదని బంగారు వృత్తి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆభరణాల తయారీలో రసాయనాల ప్రభావంతో అంగవైకల్యం చెందిన వారు చాలా మంది ఉన్నారని పేర్కొంటున్నారు.

పనుల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది



బంగారు ఆభరణాల తయారీ కోసం దుకాణాలకు ఎవరైనా వస్తారా అని ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. సీజన్లో మాత్రం పనులున్నా మిగిలిన సమయాల్లో ఖాళీగా కూర్చునే దుస్థితి వుంటుంది. రెడీమెడ్ ఆభరణాల రాకతో పనులు తగ్గిపోయాయి.

– ఇర్ఫాన్, స్వర్ణకారుడు, ఎమ్మిగనూరు

జీవనం కష్టమైంది



డిస్కౌంట్ల పేరుతో కార్పొరేట్ బంగారు నగల వ్యాపారం చేసే సంస్థల రాకతో నగలు తయారీ చేసే మాలాంటి స్వర్ణకారులకు సరైన పనులు లేక జీవనం సాగించడం కష్టమైంది. అధునాతన యంత్రాలతో తయారీ చేస్తూ కొత్త కొత్త డిజైన్లు వస్తుండటంతో వాటి పోటీని తట్టుకునే పరిస్థితి మాకు లేకుండా పోతుంది. అందువలన ప్రభుత్వం స్వర్ణకారులను ఆదుకొనేందుకు తగిన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలి.

–ఖాజ, స్వర్ణకారుడు, ఎమ్మిగనూరు

పశువులకు వైద్య పరీక్షలు

నందవరం : పాడి పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణేశ్వర ఆచారి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. అందులో భాగంగా పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేపట్టారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాడి రైతులు పశు పోషణలో రాణించాలని, అధిక లాభాలు పొందాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ బన్ని హేమంత్‌కుమార్, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: ఆలూరు మంలం మణెకుర్తి గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. పెసలబండ గ్రామానికి చెందిన ఉపేంద్ర, మౌనిక ఆలూరు మండలం దేవరగట్టులో మాళమల్లేశ్వర స్వామి దర్శనం చేసుకుని బైకుపై తిరిగి వస్తుండగా మణెకుర్తి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బైకు ఢీకొంది. దీంతో ఉపేంద్ర, మౌనికకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఉపేంద్రను కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద తుంగభద్ర నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కోసిగి: బంగాళ ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణం మరో రెండు రోజుల పాటు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందని, తంగభద్ర నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మంగళవారం కోసిగి మండలం కందుకూరు గ్రామ సమీపంలోని రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) ఆనకట్ట వద్ద తుంగభద్ర నది నీటి ప్రవాహాన్ని తహసీల్దార్ నిత్యానందరాజుతో కలిసి పరిశీలించారు. వర్షాల కారణంగా తుంగభద్ర నది నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. నదీతీర ప్రజలు, రైతులు, చేపలు పట్టే జాలర్లు నది వైపు వెళ్లరాదన్నారు. తీర ప్రాంతంలోని పొలాల రైతులు అప్రమత్తంగా ఉండి మోటార్లు, పనిముట్లు భద్రపరుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీరు వస్తే పునరావాస కేంద్రంగా కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ తిక్కస్వామి, వీఆర్వో బసవరాజు, బాలస్వామి తదితరులు ఉన్నారు.

మాచాపురంలో 'పల్లె పండుగ'



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయ నాగేశ్వరరెడ్డి

నందవరం : మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి హాజరై గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, మినీ గోకులాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామాలలో నెలకొన్న సీసీ రోడ్లు, తాగునీరు కుళాయిలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని గ్రామస్తులు విన్నవించారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని ఎమ్మెల్యే రిబన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

నేడు కౌతాళానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రాక

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసేందుకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ మెంబర్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం సత్వరం చేపట్టాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీపీఎస్సీ చైర్మన్ రాజీనామా చేసి మూడునెలలైనా కొత్త వారిని నియమించకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. చైర్మన్‌ను నియమించి గ్రూప్స్‌కు సంబంధించిన ఉద్యోగాలను భర్తీ చేసే ప్రక్రియను ప్రారంభించాలని, ఇందుకు గవర్నర్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించకపోవడంతో నిరుద్యోగులు ఆయా ఉద్యోగాల పరీక్షల కోసం శిక్షణ పొందుతూ ఎదురు చూసే దుస్థితి నెలకొందన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా జాబ్‌క్యాలెండర్‌ను ప్రకటించి నెలల వారీగా పరీక్షలు నిర్వహించాలని కోరారు.

పంట నమోదు జాబితాను పరిశీలించుకోండి



రైతు సేవా కేంద్రంలో పంటనమోదు జాబితా ప్రదర్శన

పెద్దకడబూరు: 2024 ఖరీఫ్ సీజన్‌లో పంట జాబితాను సరిచూసుకోవాలని మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నతూంబళం రైతు సేవా కేంద్రం ఆవరణలో సామాజిక తనిఖీ కోసం పంట జాబితాను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు జాబితాలో పంటల సర్వే నంబర్, నీటి సదుపాయం తదితర వివరాలను సరిచూసుకోవాలన్నారు.

ఏవైనా పొరపాట్లు ఉంటే బుధవారం సాయంత్రంలోగా రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలియజేయాలన్నారు. సామాజిక తనిఖీ అనంతరం ఈనెల 18న తుది జాబితా తయారు చేయడం జరుగుతోందన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తుపాన్ హెచ్చరికల కారణంగా రాబోవు రెండు రోజులు పాటు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ సూచించారు. పంట కోతలు ఏవైనా ఉంటే అలాంటి వారు వాయిదా వేసుకోవాలన్నారు.

మారుకా పురుగును నివారించాలి



గ్రామసభ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

గోనెగండ్ల : కంది పంట సాగుచేసిన రైతులు మారుకా పురుగు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. మంగళవారం మండలంలోని బి.అగ్రహారంలో గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కందిలో మారుకా పురుగు నివారణకు నోవాలురాన్ ఒక మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 2024లో ఖరీఫ్ పంట నమోదు, ఈ–కేవైసీ చేయించుకున్న రైతుల తుది జాబితా రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వాటిలో సరి చూసుకొని, ఏమైనా తప్పులు ఉంటే అధికారులచే సరిచేయించుకోవాలని సూచించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి కంది పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగారెడ్డి, వీఏఏ మల్లికార్జున, గ్రామస్తులు రంగన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కేజీబీఎస్ రాష్ట్ర నాయకుడు ఎండి ఆనంద్‌బాబు

ఎమ్మిగనూరుటౌన్: కాటికాపరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కేజీబీఎస్ రాష్ట్ర నాయకుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో శ్మశానాల్లో వృత్తిని నిర్వహించే కాటికాపరుల సమస్యలపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్మశానాల్లో వృత్తిని నిర్వహించే వారిని నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, జీవన భృతిని కల్పించాలన్నారు. సదస్సులో ఆయా సంఘాల నాయకులు బేగరి తిక్కప్ప, ఎన్‌జీ.కృష్ణ, కెవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగమ్మ, జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పరిశీలన



మాచాపురంలో పౌష్టికాహార కిట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే పౌష్టికాహార కిట్లను తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేస్తున్న చిక్కీలను తహసీల్దార్ తనిఖీ చేశారు. .పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే గుడ్లు, పౌష్టికాహారం కిట్లు, చిక్కీలను విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, గణాంకాల అధికారి సూర్య ప్రకాష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

- మన ఆరోగ్యం మన చేతుల్లోనే
- పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు



మాచుమాన్‌దొడ్డి పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే వుంటుంది. దానిని ఆచరిస్తే రోగాలు దరిచేరవన్నది అందరికి తెలిసిందే. చేతులు శుభ్రం ఉంటే మూడొంతుల వ్యాధులు దరిచేరవు. రోగాలు దరి చేరనీయకుండా 2008 నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 15న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే అన్ని పాఠశాలల్లో మంగళవారం చేతుల శుభ్రతపై విద్యార్థులకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అవగాహన కల్పించారు. చేతుల శుభ్రం చేసే విధానంలో నీరు, సబ్బు, శానిటైజర్లు వినియోగంతో చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో వివరించారు.


చేతుల శుభ్రంతో సూక్ష్మజీవులు దరిచేరవు

చేతుల ద్వారానే వ్యాధికర సూక్ష్మజీవులు శరీరంలో ప్రవేశిస్తాయన్నది తెలిసిందే. అందుకే చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా జలుబు, శ్వాసకోశ, జీర్ణ సమస్యలు, జ్వరం, అతిసార, లాంటి వ్యాధులు చేతులు పరిశుభ్రత లేకపోవడం వల్లే వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మల, మూత్ర విసర్జన తర్వాత, ఆహారం తినే ముందు, పిల్లలకు ఆహారం తినిపించే ముందు, అనారోగ్యంతో ఉన్న వారికి భోజనం పెట్టేముందు, పెంపుడు జంతువులు తాకినప్పుడు, పిల్లలు మట్టిలో ఆడుకున్నప్పుడు తప్పని సరిగా చేతులను బాగా శుభ్రం చేసుకోవాలి.

చేతులు ఇలా శుభ్రం చేసుకోవాలి..

చేతులు శుభ్రం చేసుకోవడంలో భాగంగా నీటిలో చేతులను తడపాలి. చేతులకు సబ్బు లేదా సున్నిపిండి, నిమ్మకాయ రసం, లిక్విడ్ తదితర వాటిలో ఏదో ఒకటి రుద్దుకోవాలి. రెండు చేతుల మధ్య గట్టిగా రుద్దుతూ శుభ్రం చేసుకోవాలి. చేతుల వెనుక భాగాలు, చేతి వేళ్ల మధ్యలో, గోళ్ల సందుల్లో శుభ్రం చేసుకోవాలి. అర చేతులను వేళ్లతో రుద్దుతూ మణికట్టు భాగం నుంచి సబ్బు పోయేంత వరకు నీటిని పోస్తూ కడగాలి. 20సెకెన్లపాటు అయిదు పర్యాయాలు శుభ్రం చేసుకోవాలి. తరువాత మెత్తటి ఉతికిన వస్త్రంతో తుడుచుకోవాలి లేదా చేతులను విదిలించాలి.


చేతుల శుభ్రత ప్రతి ఒక్కరికి అవసరమే



చేతులు శుభ్రం చేసుకోవడం ప్రతి ఒక్కరికి అవసరమే.కాలకృత్యాలనంతరం, భోజనం చేసే ముందు ఖచ్చితంగా చేతులు శుభ్రం చేసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలు ఏదైనా తినే ముందు చేతులు శుభ్రం చేయించడం అలవాటు చేయాలి. చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా చాలా వరకు రోగాలు దరి చేరవు.

– డాక్టర్ బాలజీ కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు

విద్యార్థుల్లో అవగాహన పెంచుతున్నాం



చేతుల శుభ్రత ద్వారా రోగాలు దరి చేరవన్న అంశంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం ముందు తర్వాత, మల, మూత్ర విసర్జన తర్వాత విధిగా చేతులు శుభ్రం చేసుకొనే విధానాలు తెలియజేసి వారిని చైతన్య పరుస్తున్నారు. పిల్లల చేతుల శుభ్రతను తల్లిదండ్రులు కూడా ఇళ్లలో పర్యవేక్షిస్తే మంచిది.

– మధుసూదన్‌రాజు, ఎంఈఓ 2, ఎమ్మిగనూరు

దళితవాడలో సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న మాలహానాడు ఆదోని డివిజన్ అధ్యక్షుడు బసాపురం ఎల్లప్ప

ఆదోని రూరల్: మండలంలోని 104 బసాపురం గ్రామంలోని దళితవాడలో సమస్యలు పరిష్కరించాలని మాలహానాడు ఆదోని డివిజన్ అధ్యక్షుడు బసాపురం ఎల్లప్ప ఎమ్మెల్యే పార్థసారథిని కోరారు. మంగళవారం 104 బసాపురం గ్రామంలో 'పల్లె పండగ' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తూ గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మాలహానాడు ఆదోని డివిజన్ అధ్యక్షుడు బసాపురం ఎల్లప్ప దళిత వాడలో ఎమ్మెల్యేతో పాటు పర్యటించి పలు సమస్యలను ప్రత్యక్షంగా చూపించారు. అయితే కావాలనే తనను మరుగుదొడ్లు ఉన్న ప్రాంతం వైపు తిప్పుతున్నారని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఎల్లప్ప మాట్లాడుతూ అలాంటి ఉద్దేశం ఏమీ లేదని, నిత్యం అక్కడ నివాసం ఉంటూ మేము రోజూ తిరుగుతున్న రోడ్డు అని చెప్పారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితులతో ఎస్ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది

కోసిగి: మండల కేంద్రానికి చెందిన వెంకటేష్, తిక్కోడు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు కోసిగి ఎస్ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామ రోడ్డులోని జగనన్న కాలనీ సమీపం నుంచి రెండు బైక్‌లపై 20 బాక్స్‌లలో 1920 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ (90ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని, బైక్‌లను సీజ్ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఏఎస్ఐ నాగరాజు, కానిస్టేబుల్ రాంప్రతాప్ ఉన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- నవంబర్ 15 వరకు పప్పుశనగ సాగుకు అనుకూలం
- విత్తన శుద్ధి తప్పనిసరి
- ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచనలు



మాట్లాడుతున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ

గోనెగండ్ల : రబీ సీజన్‌లో సాగుచేసే పంటల్లో పప్పుశనగలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. శనగ పంటను సాగుచేసే విధానం, విత్తన రకం, విత్తన శుద్ధి, ఎరువులు వాడకం, కలుపులో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

విత్తన రకాలు

ప్రస్తుతం జేజీ 11 రకం సాగులో ఉంది. ఇవే కాకుండా నూతన వంగడాలైన ఎన్‌బీఈజీ 452, ఎన్‌బీఈజీ 776, ఎన్‌బీఈజీ 857 కూడా సాగు చేసుకోవచ్చునన్నారు.

శనగ విత్తే సమయం

పప్పు శనగ పంటను అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు సాగుచేసుకోవచ్చు.

విత్తు విధానం

గింజలు భూమిలో 5-8 సెంటి మీటర్లు లోతున పడేటట్లు విత్తుకోవాలి. వరసల మధ్య 30 సెంటీ మీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీ మీటర్లు ఉండేలా, ఒక చదరపు మీటరుకు 33 మొక్కలు ఉండేలా చూసుకోవాలన్నారు.

విత్తన మోతాదు

ఎకరానికి 35 నుంచి 40 కిలోల విత్తనం విత్తుకోవాలి.

విత్తన శుద్ధి

కిలో విత్తనానికి వైటవాక్స్ 1.5 గ్రాములు లేదా రాక్సిల్ 1 గ్రాము కలుపుకొని విత్తన శుద్ధి చేసుకోవాలి. తర్వాత ట్రైకో డర్మా విరిడి 8-10 గ్రాములు కిలో విత్తనానికి కలుపుకొని విత్తనశుద్ధి చేసుకొని విత్తుకోవాలి.

ఎరువుల వాడకం

పప్పుశనగ సాగు చేసిన పొలాల్లో ఎకరానికి 18 కిలోల యూరియా, 125 కిలోల సూపర్ ఫాస్పేట్ ఎరువులు లేదా 50 కిలోల డీఏపీ ఎరువులు వేసుకోవాలి. ఎకరానికి 8-10 కిలోల గంధకం గుళికలు వేసుకోవాలి.

కలుపు యాజమాన్యం

విత్తిన 24 గంటలలోపు ఎకరానికి 1.2 లీటర్ల పెండిమిథాలిన్ కలుపు మందును పిచికారీ చేసుకుంటే కలుపును సమర్థవంతంగా అరికట్టవచ్చునన్నారు. 30 రోజుల వరకు పంటలో కలుపు లేకుండా అంతర కృషి చేయాలి. లేదా అవసరం అయితే కూలీలతో కలుపు తీయించాలి.